రైతులకు అప'కారం'!

- మిరపకు గిట్టుబాటు ధరపై చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వం
- నష్టానికి దిగుబడులు అమ్ముకుంటున్న రైతన్నలు
- క్వింటా మిర్చి రూ.7వేల నుంచి రూ.8 వేలు దాటని వైనం
- కన్నీరు మున్నీరవుతున్న అన్నదాత

కనికరం లేని కూటమి ప్రభుత్వ పాలనలో అన్నదాతకు అపకారం జరుగుతోంది. ప్రభుత్వం రైతన్నల కంట కన్నీరు పెట్టిస్తోంది. మద్దతు ధరను దస్త్రాలకు పరిమితం చేసి మిరప రైతును నిండా ముంచుతోంది. మార్కెట్లో ధర అమాంతం పడిపోవడంతో లబోదిబోమంటున్నారు. నష్టాలకు దిగుబడులను అమ్ముకుంటూ అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఆరుగాలం శ్రమించినా సరైన దిగుబడిలేక, అరకొరగా వచ్చిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక అప్పుల బాధతో కర్షకులు కన్నీరు మున్నీరవుతున్నారు.

నందవరం : నియోజకవర్గంలో 2024–25 సంవత్సరానికి సంబంధించి ఖరీఫ్ సీజన్‌లో 12,680.15 ఎకరాల్లో ఎండు మిర్చి సాగు చేశారు. అందులో సూపర్–10, దేవనూరు డీలక్స్, తేజ రకాలు అధికంగా వేశారు. రబీలో 966.36 ఎకరాల్లో వివిధ రకాల మిర్చి పంటలను సాగు చేశారు. కూటమి ప్రభుత్వం మిర్చి క్వింటా మద్దతు రూ.11,781 ప్రకటించింది. అయితే మార్కెట్లో కనీసం గిట్టుబాటు ధరకు కూడా నోచుకోలేదు. బహిరంగ మార్కెట్లో క్వింటా రూ.7 వేల నుంచి రూ.8 వేలకు మించి పలకడం లేదు. వ్యాపారులు అడిగిన ధరలకే అన్నదాతలు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. అధిక పెట్టుబడులుతో కూడుకున్న మిరప సాగుకు ప్రభు త్వం మద్దతు ధర కల్పించకపోవడం శోచనీయం.


జొహరాపురం వద్ద కల్లంలో ఆరబోసిన మిరప


పులిచింత గ్రామంలో మిరప పంటను గొర్రెలకొదిలేసిన దృశ్యం

ఎమ్మిగనూరు నియోజకవర్గంలో మిరప సాగు వివరాలు

మండలం పేరు	విస్తీర్ణం(ఎకరాల్లో)
ఎమ్మిగనూరు	5,320.42
నందవరం	5,101.70
గోనెగండ్ల	3,214.39
మొత్తం	3,636.51

పాతాళానికి మిర్చి ధరలు

గత ప్రభుత్వ హయాంలో మిరప ధరలు రూ.20 వేలు నుంచి రూ.25 వేలు వరకు రైతులు విక్రయించారు. ప్రస్తుతం మార్కెట్లో మిర్చి ధరలు అధఃపాతాళానికి పడిపోయాయి. క్వింటా రూ.7 వేలు నుంచి రూ.8 వేలు మాత్రమే లభిస్తుంది. దీంతో రైతులకు పెట్టుబడులు కూడా దక్కే అవకాశం లేకపోగా నష్టాల ఊబిలో కూరుకుపోతున్నాడు. మార్కెట్‌లో ధర తగ్గినప్పుడు చర్యలు తీసుకుంటామన్న ప్రభుత్వం ఆ దిశగా చర్యలు శూన్యం. మిర్చి రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం వైఫల్యానికి ఇది నిదర్శనం.

అప్పులే మిగిలాయి



నేను ఎకర పొలంలో తేజ రకం మిర్చి సాగు చేశా. పంటకు తెగుళ్లు వ్యాపించి ఒక్కటే కోతకు కూలీ రూ.48 వేలు ఖర్చు అయ్యింది. గత నెల మార్చి 26వ తేదీన గుంటూరు మార్కెట్లో తేజ రకం మిర్చి క్వింటా రూ.7 వేలు మాత్రమే ధర పలికింది. 12 క్వింటాళ్ల మిర్చి రూ.7 వేల చొప్పున విక్రయించా. రూ.84 వేలు చేతికి వచ్చాయి. అందులో కూలీలకు 48 వేలు ఖర్చు చేశా. కనీసం పెట్టుబడికి రాకపోగా అప్పులు మిగిలాయి. రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలం చెందింది.

– సత్యారెడ్డి, మిరప రైతు, నందవరం మండలం

కూలీల ఖర్చులు కూడా రావడంలేదు



రెండున్నర ఎకరాల్లో తేజ రకం మిర్చి పంట సాగు చేశా. ఎరువులు, పురుగు మందులకు ఎకరానికి రూ.లక్ష చొప్పున రూ.2 లక్షలు ఖర్చు చేశా. ఎకరానికి 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మార్కెట్లో క్వింటా రూ.8 వేలకు విక్రయించా. కనీసం పెట్టుబడులు కూడా రావడం లేదు. గత ఏడాది మిర్చికి ధర రూ.22 వేలు పలికితే ఈ ఏడాది రూ.7 వేల నుంచి రూ.8వేలు మత్రామే. కనీసం పెట్టుబడులు కాదు కదా..కూలీల ఖర్చులు కూడా రావడం లేదు. భారీగా నష్టపోయాం.

– నరసింహారెడ్డి, మిర్చి రైతు, నందవరం మండలం

రైతులను విస్మరించిన కూటమి ప్రభుత్వం



మిరపకు రైతులు భారీ పెట్టుబడులు పెట్టి.. తెగుళ్ల, పురుగు ఆశించడంతో తీవ్రంగా నష్టపోయారు. అటు దిగుబడులు లేక.. ఇటు గిట్టుబాటు ధరలు లేక అన్నదాతలు నష్టాల ఊబిలో కూరుకుపోయారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మిర్చికి గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకుంది. నేడు కూటమి ప్రభుత్వం గిట్టుబాటు ధరకు కూడా చెల్లుచీటి పెట్టింది. కనీసం ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర లభించక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వెంటనే కూటమి సర్కార్ మిరప రైతులను ఆదుకోవాలి.

– వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు

క్లుప్తంగా

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వద్దు


సిబ్బందితో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ నూర్జహాన్

ఆదోని రూరల్: పారిశుద్ధ్యంపై ఏ ఒక్కరు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా బాధ్యతగా పనిచేయాలని ఆదోని డీఎల్‌పీఓ, మండగిరి గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ నూర్జహాన్ సిబ్బందికి సూచించారు. సోమవారం మండగిరి పంచాయతీ కార్యాలయంలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. పారిశుద్ధ్యం నిర్వహణపై సూచనలు సలహాలు ఇచ్చారు. ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించి పొడి చెత్త తడి చెత్తను వేరువేరుగా ఉంచేలా చూడాలని, అందుకు సంబంధించిన డస్ట్ బిన్లు అందజేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, సచివాలయం సిబ్బంది మహదేవ్, శీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 16, 17వ వార్డుల పరిధిలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా నిర్మాణంలో వున్న బ్రిడ్జి పనులతో అప్రోచ్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే పైమాలగేరిలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించమంటే కేసులా?

కోసిగి: ప్రజా సమస్యలకు పరిష్కారం చూపాలని శాంతియుతంగా అడిగితే అక్రమ కేసులు పెడతారా అని సీపీఐ కోసిగి మండల కార్యదర్శి గోపాల్ డీహెచ్‌పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఓంకార్ స్వామి, ఏఐఎస్ఎఫ్ ఉపాధ్యక్షుడు ఎస్. వీరేష్, ఏఐటీయూసీ మండల నాయకులు పరుశురామ్ ప్రశ్నించారు. బుధవారం వారు కోసిగిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పెద్దకడబూరు మండలంలో తిమ్మక్కకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి స్థలానికి పోజిషన్‌కు హద్దులు చూపమని గత నాలుగు నెలలుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోలేదన్నారు. ఆమె తరుపున ఏఐఎస్ఎఫ్, సీపీఐ నాయకులు ఇన్‌చార్జ్ తహసీల్దార్ గీతా ప్రియదర్శినిని అడిగినందుకు సీపీఐ నాయకులపై దుర్భాషాలు మాట్లాడి, స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టడం ఏమిటని ఆరోపించారు.

మున్సిపల్ కార్మికుల పనివేళలు మార్చాలి

ఎమ్మిగనూరుటౌన్: ఎండలు తీవ్రమైనందున మున్సిపల్ కార్మికుల పని వేళలు మార్చాలని మున్సిపల్ వర్కర్స్ యునియన్ ఉపాధ్యక్షుడు ఎల్లప్ప, ఏఐటీయూసీ తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, తిమ్మగుడు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయ అవరణలో నిరసన వ్యక్తం చేశారు. కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఉదయం 5.30 నుంచి 11.30గంటల వరకు మాత్రమే పారిశుధ్య తదితర పనులు చేయించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు విజయేంద్ర, మున్సిపల్ వర్కర్స్ యునియన్ నాయకులు శివ, సల్మాన్, నల్లారెడ్డి, వెంకట్రాముడు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీకి పెరిగిన ఆదాయం

గోనెగండ్ల : మేజర్ గ్రామ పంచాయతీ గోనెగండ్లకు వేలం పాటల్లో గతేడాది కంటే ఈ ఏడాది రూ.1,73,000 ఆదాయం పెరిగినట్లు పంచాయతీ ఈఓ సతీష్ తెలిపారు. బుధవారం స్థానిక గ్రామ పంచాయతీలో పంచాయతీ ఈఓ సతీష్, సర్పంచ్ హైమవతి ఆధ్వర్యంలో కమేళా, సంతమార్కెట్, బండిమెట్టకు వేలం పాటలు నిర్వహించారు. వేలం పాటలో కమేళాను బలిగేరి శేషాద్రి రూ.83 వేలు, అలాగే సంతమార్కెట్ ను గంద్రగొడ్డాలి శ్రీను రూ.84,500 లకు, బండిమెట్టను బడేసా రూ.1,21,000 వేలకు దక్కించుకున్నారు. ఈఓ సతీష్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో నిర్వహించిన వేలం పాటలు కమేళా, సంతమార్కెట్, బండిమెట్ట వేలాల్లో మొత్తం రూ.2,88,500 వచ్చిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది మలాంగ్, సుభాన్, అనిల్ గ్రామస్తులు పాల్గొన్నారు.

7 నుంచి ఇంటర్ అడ్మిషన్లు

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 7వ తేదీ నుంచి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ బుధవారం తెలిపారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభమయ్యాయన్నారు. వారికి ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్స్, బ్యాగులు, సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్ రికార్డులు అందజేస్తామని తెలిపారు. ఈనెల ఒకటవ తేదీ నుంచే కళాశాలలో మధ్యాహ్న భోజనంతో ద్వితీయ సంవత్సర విద్యార్థులకు తరగతులు ప్రారంభమైనందున అందరూ హాజరుకావాలని సూచించారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

నందవరం : ఉత్తమ సేవలతోనే ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని ఈఓపీఆర్డీ సందీప్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పని చేస్తున్న ఉపాధి హామీ పథకం అధికారులు ఈసీ నూర్జహాన్ ఆస్పరి మండలానికి, సీఓలు వీణకుమారి, ప్రశాంతి, టెక్నికల్ అసిస్టెంట్ సువర్ణలత గోనెగండ్ల మండలాలకు బదిలీపై వెళ్లారు. వీరికి ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బంది శాలువలు, పూలమాలు, మెమొంటోతో సత్కరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, ఏపీఓ నూర్జహాన్, టీఏలు, సీఓలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


నందవరంలో ఉపాధి హామీ అధికారులను సన్మానిస్తున్న దృశ్యం

యార్డ్ సెక్రటరీగా కల్పన

ఆదోని అర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ సెక్రటరీగా (అదనపు బాధ్యత) కల్పన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ యార్డ్ సెక్రటరీ రామ్మోహన్ రెడ్డి గత నెల 31న పదవీ విరమణ పొందారు. ఆయన స్థానంలో నంద్యాల మార్కెట్ యార్డ్ లో రెగ్యులర్‌గా విధులు నిర్వహిస్తున్న కల్పనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆమెకు యాడ్ అసిస్టెంట్ సెక్రెటరీ శాంతి కుమార్, సూపర్ వైజర్లు జ్ఞానప్ప, మోహన్ రెడ్డి, రాము, ఆనంద్ కుమార్, నాగరాజు, శివ నరేష్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.


బాధ్యతలు స్వీకరించిన కల్పనకు శుభాకాంక్షలు తెలుపుతున్న యార్డ్ అధికారులు

ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిది

ఆదోని అర్బన్: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పనిదని ఎంఈఓలు రాజేంద్రప్రసాద్, శ్రీనివాసులు అన్నారు. బుధవారం రాజీవ్ గాంధీ నగర్‌లోని మండిగిరి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు వెంకట్రామిరెడ్డి పదవీ విరమణ సందర్భంగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహదేవప్ప అధ్యక్షతన సన్మాన సభ జరిగింది. ఎంఈఓలు ముఖ్య అతిథులుగా హాజరై వెంకట్రామిరెడ్డిని సన్మానించారు. ఆయన 34 ఏళ్ల సర్వీస్‌లో అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈఓ శివరాములు, హెచ్ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు జనార్దన్ రెడ్డి, ఆదిమూర్తి, శివరాజ్, ఫరీదా తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయుడిని సన్మానించిన ఎంఈఓలు

శ్రీరాములు ప్యానెల్ ఘన విజయం


మాట్లాడుతున్న శ్రీరాములు

ఆదోని రూరల్: ఉత్కంఠ భరితంగా సాగిన ఆదోని బార్ అసోసియేషన్ ఎన్నికల ఫలితాలు వచ్చాయి. సీనియర్ న్యాయవాది శ్రీరాములు ప్యానెల్లో ఘన విజయం సాధించింది. అధ్యక్ష స్థానానికి శ్రీరాములుకు 192 ఓట్లు రాగా మధుసూదన్ రెడ్డికి 91 ఓట్లు వచ్చాయి. కార్యదర్శిగా పోటీ చేసిన జీవన్ సింగ్‌కు 197 ఓట్లు రాగా నెట్టికంటయ్యకు 88 , ఉపాధ్యక్షుడిగా పోటీ చేసిన వెంకటేష్ కు 206 ఓట్లు రాగా, లోకేష్ కు కేవలం 80 ఓట్లు వచ్చాయి. సంయుక్త కార్యదర్శిగా పోటీ చేసిన రాజారత్నంకు 167ఓట్లు రాగా ఖలందర్ బాషాకు 118 ఓట్లు వచ్చాయని ఎన్నికల అధికారి విజయ్ భాస్కర్ రెడ్డి తెలిపారు.

సీపీఐ వీరేష్‌కు 14 రోజుల రిమాండ్

పెద్దకడబూరు : సీపీఐ మండల కార్యదర్శి వీరేష్‌కు 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత నెల 29న ఇన్‌చార్జ్ తహసీల్దార్ గీతా ప్రియాదర్శినిని దుర్భాషలాడుతూ, ఫర్నిచర్ ధ్వంసం చేసి బెదిరించడంతో ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసులో నిందితుడు వీరేష్‌ను స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద అరెస్ట్ చేసి ఆదోని రెండవ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా.. 14 రోజులు రిమాండ్ విధించినట్లు వెల్లడించారు.

ఖాజీపుర్‌లో అగ్నిప్రమాదం

ఆదోని అర్బన్: పట్టణంలోని ఖాజీపూర్‌లో బుధవారం షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. కాలనీకి చెందిన అల్తాఫ్ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. స్థానికులు వెంటనే అగ్ని ప్రమాద కేంద్రానికి సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పి వేశారు. రూ.40 వేలు నగదుతో పాటు గుడిసె పూర్తిగా దగ్ధమయ్యిందని, మొత్తం రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: వక్ఫ్ బోర్డ్ చట్ట సవరణ బిల్లును ఎన్‌డీఏ ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఇన్సాఫ్ పట్టణ కమిటీ గౌరవాధ్యక్షుడు కేసీ జబ్బార్, అధ్యక్ష, కార్యదర్శులు అజార్, సమీవుల్లా డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మూడో సారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ముస్లింలకు తీవ్ర అన్యాయం చేస్తుందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా 9.40 లక్షల ఎకరాలు కలిగిన వక్ఫ్‌భూములను కాపాడాల్సింది పోయి, వక్ఫ్ బోర్డ్‌లో అన్యమతస్తులను చేర్చడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. సమావేశంలో ఇన్సాఫ్ కమిటి నాయకులు దాదావలి, ఖాజ, ఇస్మాయిల్, రఫీక్, నబిసాబ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ

వక్ఫ్‌బోర్డ్ చట్ట సవరణ బిల్లును తక్షణం ఉభయ సభల్లో ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఎస్‌డీపీఐ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సోమప్ప సర్కిల్ వద్ద ఆపార్టీ నాయకుడు హుసేన్‌బాషా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు తక్షణం మద్దతు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు ఎన్నికల ముందు ముస్లింలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, లేనిచో వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ముస్లింలు తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు.


ఎస్‌డీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదోని అర్బన్: విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీఈ పురుషోత్తం తెలిపారు. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. హౌసింగ్ బోర్డ్ కాలనీ, కూనీముల్లా, అరంజ్యోతి నగర్, పింజారిగేరి, టెలికాం నగర్, ఎంఐజీ, ఎల్ఐజీ, హెచ్ఐజీ కాలనీలో విద్యుత్ ఉండదని, వినియోగదారులు గమనించాలన్నారు.

చలివేంద్రం ఏర్పాటు


చలివేంద్రం ప్రారంభిస్తున్న సర్పంచ్ అయ్యమ్మ


కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని ఆదోని మెయిన్ రోడ్డులో పంచాయతీ కార్యాలయం ఎదుట చలివేంద్రాన్ని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు సమక్షంలో గ్రామ సర్పంచ్ కుమారి అయ్యమ్మ చేతుల మీదుగా బుధవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా ప్రజల దాహార్తి తీర్చేందుకు ఈ చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. పంచాయతీ ఈఓ తిరుమలేశ్వర రెడ్డి, గ్రామ నాయకులు మాణిక్యరాజు, రాజేష్, మాజీ సర్పంచ్ యల్లయ్య, మాజీ కోఆప్షన్ మెంబర్ షంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు అభినందనలు


అభినందనలు తెలుపుతున్న డీఎస్పీ హేమలత

ఆదోని అర్బన్: ఆదోని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోప) పట్టణ అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్ గుప్తను ఆదోని డీఎస్పీ హేమలత అభినందించారు. గత నెలలో ఆయనకు ఉత్తమ సంఘ సేవ కర్తగా, ఉత్తమ సంఘ సేవ కేటగిరిలో తెలంగాణ రాష్ట్రం హైదరాబాదుకు చెందిన మెగా హెల్ప్ ఫౌండేషన్ వారు బంగారు నంది అవార్డును అందజేశారు. ఈ మేరకు ఆయనను డీఎస్పీ కార్యాలయానికి పిలిపించి శాలువా కప్పి సన్మానించి, అభినందించారు.

ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలి


మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు నరసింహులు

పెద్దకడబూరు: దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని, వైకల్యం మనిషికే కానీ మనస్సు కాదని, పట్టుదల, కృషి ఉంటే సాధించలేనిది ఏదీ లేదని ఉపాధ్యాయుడు నరసింహులు అన్నారు. బుధవారం స్థానిక ఎంపీపీఎస్ మెయిన్ స్కూల్‌లో ప్రపంచ ఆటిజం అవేర్నెస్ డే జరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ దివ్యాంగులను ఎవరూ తక్కువ చూడరాదని, వారి ఒంటరితనాన్ని తొలగించి మంచి మనుస్సుతో ఉత్తేజపరచాలన్నారు. భవిత సెంటర్‌కు వచ్చే విద్యార్థులకు ట్రాన్స్‌పోర్ట్, స్టైఫండ్, ఎస్కార్ట్, హోంబేస్ట్ తదితర సౌకర్యాలు కల్పించడం జరుగుతోందన్నారు. దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు ఈ సౌకర్యాలను ఉపయోగించుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు కేశవ్, మల్లికా బేగం, ఎర్రకోట గోపాల్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ మండల నాయకులు

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

కౌతాళం: వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ప్రహ్లాద ఆచారి ఆధ్వర్యంలో మండల నాయకులు, పార్టీలో వివిధ పదవులు అలకరించిన నాయకులు బుధవారం మంత్రాలయం మండలం రాంపురం గ్రామంలో ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డిని ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. తమపై నమ్మకం ఉంచి ఎమ్మెల్యే అప్పగించిన బాధ్యతలను వమ్ము చేయకుండా పని చేసి పార్టీ మరింత బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మంత్రాలయం మండల అధ్యక్షుడు భీమారెడ్డి, కౌతాళం ఎంపీపీ అమ్రేష్, వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి, కోఆప్షన్ మెంబర్ మాబుసాబ్, సర్పంచ్ పాల్‌దినాకర్ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం

గోనెగండ్ల : రీ సర్వేతోనే భూ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. పైలెట్ గ్రామంగా ఎంపికైన గోనెగండ్లలో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను బుధవారం సబ్ కలెక్టర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రీ సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా రైతులకు సమాచారం అందించి, సమర్థవంతంగా నిర్వహించాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. రైతులు ఏవైనా అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శ్రీనివాస రాజు, తహసీల్దార్ కుమారస్వామి, రీ సర్వే డీటీ శిరీష తదితరులు పాల్గొన్నారు.


గోనెగండ్ల రీ సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

ఎమ్మిగనూరురూరల్: వేసవిని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకధికారి విజయకుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ బంగారమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూస్తామని చెప్పారు. అన్ని గ్రామాలను సందర్శించి నీటి సమస్య ఉన్న గ్రామాల్లో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకునేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. నీటి సమస్య అధికంగా ఉన్న గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తామన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

ఎమ్మిగనూరుటౌన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిపో కార్యదర్శి ముస్తక్ అహమ్మద్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో కండెక్టర్లు, డ్రైవర్లు, గ్యారేజీ కార్మికులు ఎర్ర రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలన్నారు. ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు శేఖర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

శుభ్రం చేసేవారు కరువు!


మిర్చి మార్కెట్‌లో పడివున్న మిర్చి విత్తనాలు

ఆదోని అర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోని మిర్చి మార్కెట్లో నెల నుంచి చెత్తాచెదారం, మిర్చి విత్తనాలు పేరుకుపోయాయి. మిర్చి మార్కెట్లో వారానికి రెండుసార్లు క్రయవిక్రయాలు జరుగుతాయి. బుధవారం, శనివారాల్లో మాత్రమే రైతులు ఆదోని మిర్చి మార్కెట్‌కు మిర్చి దిగుబడులను తీసుకువస్తారు. అయితే గత నెల నుంచి మిర్చి యార్డులో శుభ్రం చేసేవారే కరువయ్యారు. దీంతో యార్డుకు వస్తే చెత్తాచెదారం, మిర్చి విత్తనాలతో పాటు దుమ్మూ, ధూళితో తీవ్రస్థాయిలో తుమ్ములు, అలర్జీ వస్తున్నాయని రైతులు, వ్యాపారులు, కమిషన్ ఏజెంట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం శుభ్రమైన చేయండని అధికారులకు విన్నవించినా కూడా పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి యార్డులో చెత్తాచెదారం శుభ్రం చేయాలని కోరుతున్నారు.

బడ్జెట్ లేదని పారిశుద్ధ్య సిబ్బంది తొలగింపు

ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో 25 మంది పారిశుద్ధ్య కార్మికులు కాంట్రాక్ట్ బేసిక్ కింద పనిచేస్తున్నారు. అయితే గత నెలలోనే వారికి బడ్జెట్ రాలేదని ఇంటికి పంపించారు. వారితో కాగితాలపై సంతకం చేయించుకొని పంపించారని, బడ్జెట్ వచ్చినప్పుడు మరలా పిలుస్తామని చెప్పినట్లు తెలిసింది. మూడు నెలలకు బడ్జెట్ వచ్చినప్పుడు మరలా వారిని పిలిపించి వారితో ఒక కాగితంపై సంతకం పెట్టించుకుని, ఒక నెల జీతం ఇచ్చి రెండు నెలల జీతం వారు తీసుకొని పంపుతున్నట్లు కార్మికులు ఆరోపిస్తున్నారు. ఎలాగో మూడు నెలలకు బడ్జెట్ వస్తుంది కదా అప్పటివరకు పని చేస్తాం అని చెప్పినా వద్దని పంపించేస్తున్నారని చెబుతున్నారు. ఈసారి కూడా బడ్జెట్ రాలేదని, సంతకం చేయించుకుని రావద్దని చెప్పారని తెలిపారు. యార్డులో కార్మికుల జీతాలను అధికారులు దోచుకోవడమే కాకుండా శుభ్రంగా ఉంచలేక పోతున్నారని తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.


మార్కెట్లో చెత్తాచెదారం